తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
వరంగల్ - ఆదిలాబాద్
హన్మకొండ | జనగాం | ములుగు | నిర్మల్ | మంచిర్యాల
ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి | కొమురం భీం ఆసిఫాబాద్
మహబూబాబాద్
సోమవారం
8 జూన్ 2026
పేజీలు - 8




# యూరియా కోసం రైతులకు తప్పని తిప్పలు

- ఉదయం నుంచి క్యూ కట్టిన రైతులు..

వార్త మెయిన్ 7లో

# ప్రతి గింజను కొనుగోలు చేయాలి

- రెండు నెలలుగా ఇబ్బందులు పడుతున్న రైతులు
- ఇంకెప్పుడు కొంటారని మాజీ మంత్రి ఎర్రబెల్లి ధ్వజం



పాలకుర్తి, జూన్ 07(జనం సాక్షి) : కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువచ్చిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ఈరవెన్నులో కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు.

వార్త మెయిన్ 7లో

## మహిళ సంఘాల భవనాలకు స్థలాల గోస

### ప్రజా ప్రతినిధుల వద్ద వేడుకోలు



**కౌటాల జూన్ 07(జనం సాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం స్వయం సహాయక మహిళా సంఘాలకు) శాశ్వత కార్యాలయాలుగా రాష్ట్రవ్యాప్తంగా ఇందిరా మహిళా శక్తి భవనాలను నిర్మిస్తోంది. ప్రతి భవనానికి సుమారు రూ. 10 లక్షల చొప్పున నిధులు కేటాయించి, గ్రామ స్థాయిలో ఈ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మహిళలకు మీటింగ్ పెట్టి సమావేశాలు నిర్వహించాలన్న ఎక్కడ సొంత భవనం అంటూ ఇప్పటి వరకు లేదు. ప్రభుత్వం మహిళల కోసం మంత్రి సీతక్క ప్రతి గ్రామానికి సొంత భవనం మంజూరు చేసినప్పటికీ కొన్ని గ్రామాల్లో భవన నిర్మాణానికి ప్రభుత్వ స్థలాలు కరువయ్యాయి. కౌటాల మండలంలోని ముత్తంపేట్, గుడ్లబోరి, మొగడ్ ధగడ్ గ్రామాల్లో భవనాలకు స్థలాలు దొరకక మహిళలు ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరుగుతూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏండ్లుగా భవనం లేక ఇబ్బందులు పడుతున్న సమయంలో వచ్చిన భవనం స్థలం దొరకక ఎక్కడ క్యాన్సెల్ అవుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

**స్థలం కేటాయించండి : లావణ్య, మహిళ సభ్యురాలు, గుండాయి పేట్**



మహిళలకు సొంత భవనం ఉంటే సమావేశాలు పెట్టుకొని చర్చించు కోవడానికి సులువుగా ఉంటుంది. ఎక్కడో ఒక స్థలాన్ని మహిళాల కోసం కేటాయించి భవనాన్ని నిర్మించాలని కోరుతున్నాము. గ్రామ సర్పంచ్, ప్రజా ప్రతినిధులు పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించండి.

**వినతి పత్రాలు అందజేశాం : కుసుమ, మహిళ సంఘం అధ్యక్షురాలు, కౌటాల**



గ్రామ పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, తహసిల్దార్, ప్రజా ప్రతినిధులకు భవన స్థల గురించి వినతి పత్రాలు కూడా అందజేశాము. తొందర అధికారులు స్పందించి భవన నిర్మాణానికి కృషి చేయండి. మహిళలకు వచ్చిన అవకాశాన్ని వృధా చేయకుండా సహకరించండి.

**భవనానికి స్థలం కేటాయిస్తాం : రాంటెంకి,ఉషా సర్పంచ్, ముత్తం పేట్**



మహిళల కు వచ్చిన భవనానికి స్థలం కేటాయించి తప్పకుండా నిర్మాణం చేపట్టే ఏర్పాటు చేస్తున్నాము. పై అధికారులు దృష్టికి తీసుకెళ్లి త్వరలోని స్థలం కేటాయిస్తాం. కలెక్టర్ ను ఒప్పించి మహిళలకు వచ్చిన భవన నిర్మాణానికి కృషి చేస్తాం.

# 12 కిలోల ఎండుగంజాయి స్వాధీనం

- ఇద్దరు మహిళలను అరెస్టు చేసిన పోలీసులు

వరంగల్ మండలం, జూన్ 07 (జనం సాక్షి) : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు చేపడుతున్న ప్రత్యేక చర్యలలో భాగంగా, ఆదివారం మట్వాడ పోలీస్ స్టేషన్ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో వరంగల్ హంటర్ రోడ్డులోని ఏడు మోరీల జంక్షన్ వద్ద అనుమానాస్పదంగా రెండు సూట్‌కేసులతో వెళ్తున్న ఇద్దరు మహిళలను గుర్తించి తనిఖీ చేయగా, వారు పోలీసు వాహనాన్ని చూసి పారిపోవడానికి ప్రయత్నించగా వెంటాడి పట్టుకొని విచారించినారు.

వార్త మెయిన్ 3లో



## ప్రజల సమస్యలు పరిష్కారం కోసమే ప్రజావాణి

**హనుమకొండ, ప్రతినిధి జూన్ 7 (జనం సాక్షి) :** ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి, హనుమకొండ, పరకాల రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమాలు



నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఒక ప్రకటన లో తెలిపారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలతో హాజరుకావాలని, అందిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు.

## ఎంపీ వంశీకృష్ణపై అసత్య ప్రచారాలు మానుకోవాలి

### పట్టణ అధ్యక్షుడు ఒడ్నాల శ్రీనివాస్



**రామకృష్ణాపూర్, జూన్ 07 (జనంసాక్షి):** పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీ గడ్డం వంశీకృష్ణపై మంచిర్యాల జిల్లా బీజేపీ నాయకులు అసత్య ప్రచారాలు మానుకోవాలని రామకృష్ణాపూర్ పట్టణ అధ్యక్షుడు ఒడ్నాల శ్రీనివాస్ హెచ్చరించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంచిర్యాల జగిత్యాల నాలుగు లైన్ల జాతీయ రహదారి విస్తరణకు, పెద్దపల్లి మణుగూరు రైల్వే ప్రాజెక్టు, రామగిరి ఖిల్లా, కోటిలి ంగాల అభివృద్ధి, రైల్వేస్టేషన్ల ఆధునికరణకు ఎంపీ వంశీకృష్ణ కృషి ఉందని గుర్తు చేశారు. సింగరేణిలో సుదీర్ఘకాలం పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు పదివేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని కొట్లాడుతున్న ఎంపి వంశీకృష్ణ పై అబద్ధపు ప్రచారాలు ఇప్పటికైనా మానుకోవాలని, లేనియెడల కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజా ఆగ్రహానికి గురిగాక తప్పదన్నారు. తెలంగాణ నుండి ఎంపికైన బిజెపి ఎంపీలు రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు, ప్రత్యేక ప్యాకేజీలు, ఉపాధి అవకాశాలు తీసుకురావడంలో విఫలమయ్యారని విమర్శించారు. కాంగ్రెస్ ఎంపీలు అభివృద్ధిపై చిత్త శుద్ధితో ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు బీమా మల్లేష్, కూతురు ప్రభాకర్, నాయకులు బత్తుల శ్రీనివాస్, గోపు రాజం, వేణు, వేల్పుల సత్యనారాయణ, సురేందర్, మల్లేష్, శ్రీనివాస్, లచ్చులు, లాడెన్, దీప, పుష్ప పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడిగా మామిండ్ల పోషాలు



**నల్లబెల్లి, జూన్ 07 (జనంసాక్షి):** మండలంలోని లెంకాలపెల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మామిండ్ల పోషాలును ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మాలోత్ చరణ్ సింగ్, జిల్లా కార్యదర్శి చిట్యాల తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కోమండ్ల రామ్ షా, కార్యదర్శిగా గాదం రవి, కోశాధికారుగా నూటెంకి మొగిలి, గాదం కుమారస్వామి, యూత్ కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడిగా కీసర శంకర్, ఉపాధ్యక్షుడిగా కందికొండ నాగరాజు, కార్యదర్శిగా మామిండ్ల రాజు, సోషల్ మీడియా ఇన్చార్జిగా మేకల అనిల్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు పోషాలు మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం తన వంతుగా కృషి చేస్తానని చెప్పారు. ఎంతో నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన మండల నాయకులకు, గ్రామ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు మామిండ్ల కొమురయ్య, కోమండ్ల రంగయ్య, వార్డు సభ్యులు కృష్ణ, స్వామి, కుమార్, రమేష్, రవి, మాజీ ఉపాధ్యక్షుడు కీసరి రవి, గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**చెన్నారావుపేట, జూన్ 7 ( జనం సాక్షి):** పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చెన్నారావుపేట జిల్లా పరిషత్ పాఠశాలలో 1989-90 వ సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో అప్పటి పూర్వ విద్యార్థులు పాల్గొని తాము చదువుకున్న రోజుల్లో గడిపిన తమ చిన్ననాటి చిలిపి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. అలాగే విద్యాబుద్ధులు నేర్పిన పూర్వ ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, సుదర్శన్, ప్రభాకర్, సుధాకర్, జుబేదా బేగం, ముత్యాలు, బి. సుధాకర్ లను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. తమ కుటుంబాలలో ఏ ఆపద వచ్చినా అందరం కలిసికట్టుగా ముందుండి పరిష్కరించుకుంటామని అందరూ కలిసి నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ముదురుకోళ్ల బిక్షపతి, వలస శ్యాంసుందర్, పెండ్యాల సదానందం, ఎలుగాల యాదగిరి, కుండె సాంబశివుడు, ముత్యాల అల్లాడి యాకయ్య, కోరె మల్లయ్య, నాంపల్లి రాములు, కుమారస్వామి, జంగిలి సంపత్, సుంకరి నరసయ్య, బాలు, బద్రు, సుదర్శన్, పర్శ కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.




## భక్తులతో కోలాహలంగా మారిన హేమాచల క్షేత్రం

- **హరినామ స్మరణతో మార్మోగిన మల్లూరు కొండలు**



**మంగపేట, జూన్ 07 (జనంసాక్షి)** ములుగు జిల్లా మంగపేట మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులంతా హేమాచల క్షేత్రానికి భారీగా తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణమంతా భక్తుల కోలాహలంతో, గోవింద నామస్మరణలతో మార్మోగింది. భక్తులు ముందుగా ఇక్కడి ప్రకృతి సిద్ధమైన, ఔషధ గుణాలు కలిగిన చింతామణి నిరంతర జలధారల వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. ఈ నీటిలో స్నానం చేస్తే సర్వరోగాలు నయమవుతాయని భక్తుల నమ్మకం. అనంతరం అక్కడ కొలువై ఉన్న జలాంజనేయస్వామిని, పంచముఖాంజనేయ స్వామిని, రమ సత్యనారాయణ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి దివ్య దర్శనం – విశేష అలంకరణలుఆ తర్వాత కొండపై స్వయంభువుగా వెలసిన ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి వారిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ముక్కామల రాజశేఖరశర్మ, కారంపూడి పవన్ కుమారాచార్యులు, ఏడునూతన ఈశ్వరచంద్ రామానుజన్ శర్మ, ముక్కామల వెంకటనారాయణ శర్మ, అనిపెద్ది రాజీవ్ నాగశర్మలు స్వామివారి మూలవిరాట్ కు శాస్త్రోక్తంగా తిలా తైలాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని నూతన పట్టు వస్త్రాలు, సుగంధ భరిత గజమాలతో అత్యంత సుందరంగా అలంకరించి భక్తులకు దివ్య దర్శనాన్ని కల్పించారు. అనంత రం ఆలయ అర్చకులు భక్తులకు మల్లూరు క్షేత్ర విశిష్టత వివరిస్తూ భారతదేశంలోనే ఎక్కడా లేని విధంగా ఇక్కడి నరసింహస్వామి విగ్రహం మానవ శరీరంలా మెత్తగా ఉంటుంది. స్వామివారి నాభి భాగం నుండి నిరంతరం రక్తం, చెమట లాంటి ద్రవం స్రవిస్తూ ఉండటం ఈ క్షేత్రం యొక్క అద్భుత విశేషం అని ఈ స్వామివారి చందనాన్ని ప్రసాదంగా తీసుకుంటే సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల గాఢ విశ్వాసం ఎంతో ప్రాచుర్యం పొందింది అని తెలిపారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక ఏర్పాట్లువివిధ జిల్లాల నుండి భక్తులు వేల సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాల్లో ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈవో వీరస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లను క్రమబద్ధీకరించడం, తాగునీరు, ప్రసాదాల వితరణను ఇటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలలో ఆలయ సిబ్బంది సీతారాములు, శేషు, అజయ్, నాగార్జున్, మహేష్, పుల్లయ్యలతో పాటు పెద్ద సంఖ్యలో స్వచ్ఛంద సేవకులు, స్థానిక భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## పాఠశాలల కుదింపుపై ముఖ్యమంత్రి వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

- **డిటిఎఫ్ మండల అధ్యక్షులు అంగోతు భద్రయ్య**

**చెన్నారావుపేట, జూన్ 7 ( జనం సాక్షి):** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను 27 వేల నుంచి 4 వేలకు కుదిస్తామని ముఖ్యమంత్రి చేసిన ప్రకటనను వెనక్కి తీసుకోవాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డిటిఎఫ్ )మండల శాఖ అధ్యక్షులు ఆంగోతు భద్రయ్య, ప్రధాన కార్యదర్శి రావుల ఉమాశంకర్ లు డిమాండ్ చేశారు. ఆదివారం చెన్నారావుపేట మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే ఒక్క పాఠశాలను కూడా మూసివేయమని బడ్జెట్ లో విద్యారంగాని 15 శాతం నిధులు కేటాయిస్తామని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ప్రైవేటు విద్యారంగాన్ని, ఫీజులను నియంత్రిస్తామని, ఉపాధ్యాయ ఉద్యోగుల పెండింగ్ సమస్యలన్ని పరిష్కరిస్తామని తమ ఎన్నికల మేనిఫెస్టోలో స్పష్టంగా ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పుడు ఈ తిరోగమన విధానాన్ని ప్రకటించడం సరికాదన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడానికి గల కారణాలను సమగ్రంగా అధ్యయనం చేయకుండా ఇలా పాఠశాలలను మూసి వేసుకుంటూ వెళ్తే త్వరలో ప్రభుత్వ విద్యారంగం పూర్తిగా కనుమరుగై విద్యారంగం ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ పెరిగిపోయే ప్రమాదం ఉందన్నారు. దీని ద్వారా పేద విద్యార్థులకు విద్య అందకుండా పోయే అవకాశం ఉందన్నారు. ఈ చర్య ద్వారా సామాజిక, ఆర్థిక సమానతలు మరింత పెరిగిపోతాయన్నారు. ఈ కుదింపు ప్రక్రియ అంతా ప్రపంచ బ్యాంకు విధానాలకు అనుగుణంగా చేపట్టే విధానాలే అన్నారు. ముఖ్య మంత్రి స్వయంగా విద్యాశాఖ మంత్రిగా ఉండి ఇలాంటి నిర్ణ యాలు తీసుకోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా బడ్జెట్లో విద్యారం గానికి అధిక నిధులు కేటాయించి, విద్యారంగ సమస్యలు పరిష్కరించి, ప్రతి ప్రాథమిక పాఠశాలలో పూర్వ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టి, సరైన పర్యవేక్షణ, సరైన మౌలిక వసతులు కల్పించి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. లేనిచో పాఠశాలల రేషనలైజేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల కుదింపుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు.



## తెలంగాణ రాజ్యాధికార పార్టీ మండల అధ్యక్షుడిగా నీల లింగం

### కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన నీల లింగం



**స్టేషన్ ఘన్పూర్, జూన్ 07 ( జనం సాక్షి ) :** తెలంగాణ రాజ్యాధికార పార్టీ స్టేషన్ ఘనపూర్ మండల అధ్యక్షుడిగా శివుని పెల్లి గ్రామానికి చెందిన నీల లింగం (వెంకటేశ్వర్లు) ముదిరాజ్ ఎన్నికైనారు. స్టేషన్ ఘన్పూర్ పట్టణ కేంద్రంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు కట్ల సాధనందం ఆధ్వర్యంలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావే శానికి పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాధం రజిని కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై నారు. ఈసమావేశంలో నీల లింగం (వెంకటేశ్వర్లు) ముదిరాజ్ ను తెలంగాణ రాజ్యాధికార పార్టీ మండల అధ్యక్షుడిగా నియమించారు. మాధం రజిని కుమార్ యాదవ్ నియామక పత్రాన్ని నీల లింగం కు అందజేశారు. ఈ సందర్భంగా నీల లింగం మాట్లాడుతూ గత40 సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీ జెండా కింద పనిచేసిన ఇంతవరకు ఎలాంటి గుర్తింపు రాలేదని అందుకే కాంగ్రెస్ పార్టీ కి రాజీనామా చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ లో ఎలాంటి పదవులు ఆశించకుండా పార్టీ ఆదేశా ల మేరకు, పార్టీ బలోపేతానికి కృషిచేసిన కాంగ్రెస్ పార్టీ ఎలాంటి గుర్తింపు ఇవ్వలేదని, మొన్న జరిగి న మున్సిపల్ ఎలక్షన్ లో కూడా కాంగ్రెస్ పార్టీ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి టికెట్ ఇస్తా అని చెప్పి ఇవ్వకుండా తనను మోసం చేశారని మనస్థాపం తో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయడం జరిగింద ని అన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులను ఏ రోజు కూడా లెక్క చేయడం లేదని, ఇప్పుడున్న కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి పదవులు ఇవ్వకుండా, తనతో పార్టీ మారినటువంటి వారికి మాత్రమే పదవులు ఇవ్వడం జరుగుతుందని అన్నారు . స్టేషన్ఘన్పూర్ లో ఇకపై కడియం శ్రీహరిని ప్రజలు కూడా నమ్మే ప్రసక్తి లేదని తెలిపారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ బలోపేతం కోసం రాష్ట్ర పార్టీ జిల్లా పార్టీ పిలుపుమేరకు అంకితభావంతో పని చేస్తానని వారు అన్నారు. నా ప్రజాసేవ ని గుర్తించి నాపై నమ్మకంతో తెలంగాణ రాజ్యాధి కార పార్టీ మండల అధ్యక్ష పదవి బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజనీకుమార్ యాదవ్ కి, జిల్లాఅధ్యక్షుడు సదానందకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## విద్య సేవా? వ్యాపారమా? జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలపై పెరుగుతున్న విమర్శలు



**నిర్మల్ బ్యూరో, జూన్ 7: (జనంసాక్షి)** నిర్మల్ జిల్లాలో ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వహణపై రోజు రోజుకు విమర్శలు పెరుగుత ున్నాయి. ఐఐటి ,జేఈఈ నీట్ ఫౌండేషన్ ,ఒలింపియాడ్, ఇం టర్నేషనల్ స్కూల్, వంటి ఆకర్షణీయ పేర్లతో విద్యార్థుల అడ్మిషన్లు పెంచుకుంటూ, భారీ ఫీజులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతు న్నాయి .జిల్లాలోని 19 మండలాల్లో అనేక ప్రైవేట్ పాఠశాలలు ప్రత్యేక కోచింగ్, ర్యాంకుల హామీలు, అంతర్జాతీయ స్థాయి విద్య పేరుతో తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. అయితే ఈ పేర్లకు తగిన అనుమతులు, ప్రమాణాలు ఉన్నాయా లేదా అనే అంశంపై స్పష్టత లేదని అంటున్నారు.చిన్నారులపై అధిక చదువు భారం, ప్రతిరోజూ పరీక్షలు, ప్రత్యేక కోచింగ్‌ల పేరుతో మానసిక ఒత్తిడి పెరుగుతోందని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అడ్మిషన్, ట్యూషన్, ట్రాన్స్‌పోర్ట్, పుస్తకాలు, యూనిఫాంల పేరుతో భారీ మొత్తాలు వసూలు చేయడం వల్ల మధ్యతరగతి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తల్లిదండ్రులు చెబుతున్నారు.జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల అనుమతులు, మౌలిక సదుపాయాలు, ఫీజుల నిర్మాణం, ప్రకటనలపై విద్యాశాఖ అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అనుమతులు లేని విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఫీజుల నియంత్రణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.ఈ సందర్భంగా చాత్ర యువ సంఘర్షణ సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శీతల్కర్ అరవింద్ మాట్లాడుతూ, విద్యను వ్యాపారంగా మార్చే ధోరణిపై ప్రభుత్వం వెంటనే స్పందించి పారదర్శక విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విద్య అనేది ప్రతి చిన్నారి హక్కు అని, దానిని లాభార్జన సాధనంగా మార్చే వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

## ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకునే బాధ్యత వ్యవసాయ కార్మికులది

### జిల్లా కార్యదర్శి సింగారపు రమేష్



**బచ్చన్నపేట జూన్ 6 ( జనం సాక్షి):** పేదల ఉపాధి కోసం పోరాటం చేసి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేస్తే ఊరుకునేది లేదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జనగామజిల్లా కార్య దర్శి సింగారపు రమేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సంఘం కార్యాలయంలో జరిగినటువంటి ఏడవ మండల మహాసభలో మండల అధ్యక్షులు ఇంజ ఎల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ అట్టడుగు వర్గాల కోసం దినసరి కూలీల కోసం వామపక్షాల ఆధ్వర్యంలో యూపీఏ ప్రభుత్వం హయాంలో సాధించినటువంటి ఉపాధి హామీ చట్టాన్ని ఈరోజు కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి ప్రభుత్వం నేరుగారిచే విధంగా విబి రాంజీ బిల్లును తీసుకురావడం దుర్మార్గమన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకునే బాధ్యత వ్యవసాయ కార్మికులపై ఉందన్నారు .కేంద్ర ప్రభుత్వం విధానాలపై పోరాటాలు నిర్వహించే విధంగా వ్యవసాయ కార్మికులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఉపాధి పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఉపాధి కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిచో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పొత్కనూరు పేందర్.వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తాడెం రాములు. పాల్గొన్నారు. అనంతరం మండల కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది వ్యవసాయ కార్మిక సంఘం బచ్చన్నపేట మండల అధ్యక్షులుగా భామర్లపల్లి సంపూర్ణ. కార్యదర్శిగా తాడేం రాములు. ఉపాధ్యక్షులుగా ఇంజ ఎల్లయ్య. కుడుదల సిద్దయ్య. సిద్దయ్య సహకార దర్శిగా మానేపల్లి భూమయ్య. కంట్రాజు కిష్టయ్య. కమిటీ సభ్యులుగా ఆరుగురితో కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది

## ఏకన్నగూడెం రాళ్ళ వాగు వంతెన నిర్మాణం వెంటనే చేపట్టాలి



**నూగూర్ వెంకటాపురం జూన్ 7(జనం సాక్షి ):-** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఏకన్నగూడెం రాళ్ళ వాగు బ్రిడ్జి ని సందర్శించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలు గా భద్రాచలం నియోజకవర్గం ప్రజలు రవాణా సౌకర్యం లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాళ్లవాగు పైన నిర్మించిన బ్రిడ్జి శిదిలావస్థ లో ఉందని, వచ్చేది వర్ష కాలం లో ప్రజలు రవాణా మార్గం స్తంబించకుండా ప్రజలు ఇబ్బంది పడకుండా శిదిలావస్థ లో ఉన్నటువంటి వంతెన ప్రత్యామ్నాయం గా వంతెన ని నిర్మించాలని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు అయినా నిమ్మకు నిరేత్తినట్లు ఉందని అన్నారు. గత కొన్ని సంవత్సరాల నుండి రహదారి నిర్మాణం వంతెన శిదిలావస్థలో ఉన్న పట్టింపు లేదని అన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ చొరవ తీసుకోని రాళ్ళ వాగు వంతెన నిర్మాణం కొరకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో సీనియర్ నాయకులు ఉప్పల కృష్ణ మూర్తి, మండల ప్రధాన కార్యదర్శి సాధనపల్లి విజయకుమార్, నోముల శ్రీ కిషన్, మండల ఉపా అధ్యక్షురాలు అంకాళ దుర్గ, కాలం సాయిప్రసాద్, అలెం కృష్ణ రావు, తదితరులు పాల్గొన్నారు.

## మాన్‌పవర్ కన్సల్టెన్సీ ని ప్రారంభించిన మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి



**నిర్మల్ టౌన్, జూన్ 7: (జనంసాక్షి)**నిర్మల్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్‌వీఆర్ ఇంటర్నేషనల్ మాన్‌పవర్ కన్సల్టెన్సీ కార్యాలయాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి ఆదివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఇటువంటి మాన్‌పవర్ కన్సల్టెన్సీలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. నిరుద్యోగ యువత తమ నైపుణ్యాలను పెంపొందించుకొని అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అనంతరం కన్సల్టెన్సీ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, సంస్థ విజయవంతంగా ముందుకు సాగి మరింత మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కత్తి నరేందర్, గోపు గోపి, శనిగరాపు నరేష్, లక్కాకుల హరీష్, పెండం శ్రీనివాస్, గుంజాల చైతన్య, రాఘవేంద్ర చారి, టౌన్ ప్రెసిడెంట్ నాందేడపు చిన్ను తదితరులు పాల్గొన్నారు.

## రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

### గూడూరు సీఐ వర్స వినయ్ కుమార్



**గూడూరు,జూన్07(జనంసాక్షి):** గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖకు సహకరించాలని గూడూరు సీఐ వర్స వినయ్ కుమార్ తెలిపారు.ఆదివారం గూడూరు పోలీస్ స్టేషన్ లో సర్కిల్ ఇన్స్పెక్టర్ వినయ్ కుమార్ మండల పరిధిలోని రౌడీ షీటర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వారితో మాట్లాడుతూ రౌడీ షీటర్ల శాంతిబ ద్రతలకు విఘాతం కలిగించే కార్యకలాపాలకు దూరంగా ఉండాలని,నేరాలకు పాల్పడకుండా సజ్జన పౌరులుగా జీవించాలని సూచించారు.గ్రామాల్లో ఎలాంటి గొడవలు,భూ వివాదాలు, దౌర్జన్యాలు, బెదిరింపులు లేదా ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లయితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అలాగే ప్రజలు కూడా ఎటువంటి నేర కార్యకలాపాలకు పాల్పడకుండా చట్టాలను గౌరవించాలని,గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు శాఖకు సహకరించాలని సూచించారు.గంజాయి,మత్తు పదార్థాల విని యోగం,అక్రమ రవాణా,జూదం,దౌర్జన్యాలు, మహిళలపై వేధింపులు మరియు ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రజలందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు సహకరించాలని కోరారు.

## వ్యవసాయ కార్మికులకు పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

### వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నక్క సైదులు



**గూడూరు,జూన్07(జనంసాక్షి):** 50సం,,లు నిండిన వ్యవసాయ కార్మికులకు పెన్షన్ విధానాన్ని ప్రభుత్వం అమలు చేయాలనీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నక్క సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదివారం గూడూరు మండలం అప్పరాజుపల్లి గ్రామంలో సంఘం విస్తృత స్థాయి సమావేశం మన్నెం మల్లేష్ అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సైదులు హాజరై మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో పనులు చేస్తూ 50 సం,,లు నిండిన ప్రతి వ్యవసాయ కూలీకి నెలకు 6000 రూ,,లు, పెన్షన్ అందజేసి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ ఉత్పత్తిలో కీలక భాగస్వామ్యం కలిగిన మహిళలు తీవ్రమైన అనారోగ్య పాలవుతున్నారని,చాలి చాలని కూలి, పెరుగుతున్న ధరల రీత్యా వ్యవసాయ కూలీలు మరింత దారిద్రంలోకి వెళుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్,గ్యాస్ ధరలను అనేక సార్లు పెంచడం వల్ల ప్రజలు వాడుకునే ఆహార ధాన్యాలు నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశానంటతున్నాయని,60 సం,,లు నిండిన ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఏలా వస్తున్నాయో,వ్యవసాయ రంగంలో పనులు చేస్తున్న వ్యవసాయ కూలీలకు ప్రభుత్వం అలాంటి బెనిఫిట్స్ సౌకర్యం కల్పించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో సంఘం జిల్లా కమిటీ నాయకులు గొల్లపల్లి కృష్ణ, మండల వీరన్న, బ్రహ్మచారి, మల్లేష్, వెంకన్న,లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు



**తాండూర్, జూన్ 7(జనం సాక్షి)**మంచిర్యాల జిల్లా :జెడ్పీహెచ్ఎస్ తాండూర్‌లో 2010 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు 16 సంవత్సరాల అనంతరం ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా బాల్య స్నేహితులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ పాఠశాల రోజుల మధుర జ్ఞాప కాలను గుర్తుచేస ుకున్నారు.పాఠశాలలో గడిపిన ఆనంద క్షణాలు, ఉపాధ్యాయుల బోధనలు, సహచర విద్యార్థులతో ఉన్న అనుబంధాన్ని నెమరువేసుకుంటూ తమ జీవిత ప్రయాణాలను పరస్పరం పంచుకు న్నారు. ప్రస్తుతం వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు16 సంవత్సరాల తర్వాత మళ్లీ ఒకేచోట కలుసుకోవడం ఎంతో ఆనందం గా ఉందని, ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలు స్నేహ బంధాలను మరింత బలోపేతం చేస్తాయని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు.

# 12 కిలోల ఎండు గంజాయి స్వాధీనం

## ఇద్దరు మహిళలని అరెస్టు చేసిన పోలీసులు



**వరంగల్ మండలం, జూన్ 07 (జనం సాక్షి)** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు చేపడుతున్న ప్రత్యేక చర్యలలో భాగంగా, ఆదివారం మట్వాడ పోలీస్ స్టేషన్ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో వరంగల్ హంటర్ రోడ్డులోని ఏడు మోరీల జంక్షన్ వద్ద అనుమానాస్పదంగా రెండు సూట్‌కేసులతో వెళ్తున్న ఇద్దరు మహిళలను గుర్తించి తనిఖీ చేయగా, వారు పోలీసు వాహనాన్ని చూసి పారిపోవడానికి ప్రయత్నించగా వెంటాడి పట్టుకొని విచారించినారు. 1) త్రివేణి రామనాథ్ ఘోడ్కే, వయస్సు 26 సంవత్సరాలు, నివాసం పూణే, మహారాష్ట్ర మరియు 2) అంజలి రామ్ సాథే, వయస్సు 25 సంవత్సరాలు, నివాసం పూణే, మహారాష్ట్రగా తెలియజేసినారు. అనంతరం పై అధికారుల ఆదేశాల మేరకు వరంగల్ మున్సిపల్ కార్యాలయం నుండి పంచులను పిలిపించి, క్లూస్ టీం సిబ్బందిని సంఘటనా స్థలానికి రప్పించి, పంచుల సమక్షంలో చట్టబద్ధంగా తనిఖీ నిర్వహించగా, వారి వద్ద ఉన్న రెండు సూట్‌కేసులలో మొత్తం ఆరు ప్యాకెట్లలో నిల్వ ఉంచిన 12 కిలోల ఎండు గంజాయి లభించినది. ప్రతి ప్యాకెట్‌ను విడిగా పరిశీలించి, డిజిటల్ త్రాసు సహాయంతో తూకం వేయగా ఒక్కో ప్యాకెట్ సుమారు 2 కిలోల చొప్పున ఉండగా, మొత్తం 12 కిలోల ఎండు గంజాయి ఉన్నట్లు నిర్ధారించబడినది. పంచుల సమక్షంలో గంజాయిని స్వాధీనం చేసుకొని, నమూనాలు సేకరించి, సీజ్ ప్రక్రియ పూర్తి చేయబడినది. విచారణలో నిందితురాళ్లు పూణే, మహారాష్ట్ర నుండి ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్ రైల్వే స్టేషన్ సమీపంలో నివసించే బీజేష్ వ్యవన్ సోనీ మానిష్ సహూ వద్ద రూ.60,000/- చెల్లించి 12 కిలోల ఎండు గంజాయిని కొనుగోలు చేసి, పూణేకు తరలించే క్రమంలో వరంగల్ రైల్వే స్టేషన్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు గమనించి భయపడి రైలులో నుండి దిగిపోయి, రైల్వే స్టేషన్ వెనుక మార్గం ద్వారా తప్పించుకొని కాజీపేట వైపు వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా మట్వాడ పోలీసులకు పట్టుబడినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. నిందితురాళ్ల వద్ద నుండి గంజాయి కొనుగోలు, రవాణాకు ఉపయోగించిన రెండు మొబైల్ ఫోన్లు కూడా స్వాధీనం చేసుకోబడినవి. క్లూస్ టీం సిబ్బంది మొత్తం ప్రక్రియను ఫోటోలు, వీడియోల రూపంలో నమోదు చేయగా, వాటిని కూడా కేసు ఆస్తిగా స్వాధీనం చేసుకొనబడినవి. స్వాధీనం చేసుకున్న 12 కిలోల ఎండు గంజాయి మార్కెట్ విలువ సుమారు రూ.6,00,000/- (ఆరు లక్షలు) గా అంచనా వేయబడినది. నిందితురాళ్లపై ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టబడినవి. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, కొనుగోలు, అమ్మకం, నిల్వ మరియు వినియోగంపై వరంగల్ పోలీస్ కమిషనరేట్ కఠిన చర్యలు కొనసాగిస్తోందని, ప్రజలు ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100/112కు సమాచారం అందించాలని పోలీసు అధికారులు విజ్ఞప్తి చేసినారు.

# నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై పిడి యాక్ట్ నునమోదు చేయాలి



**పర్వతగిరి జూన్ : (జనం సాక్షి)** మండల కేంద్రంలో ఆదివారం రోజున పర్వతగిరి మండల మాజీ రైతుబంధు అధ్యక్షుడు చిన్నపాక శ్రీనివాస్ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై ఈ సమయంలో వివిధ రకాల కంపెనీల పేర్లతో గ్రామాలలో మండలం కేంద్రాలలో రైతులకు విత్తనాల అందజేస్తామని చెప్పి నకిలీ విత్తనాలు అంటగట్టే ప్రమాదం పొంచి ఉందని దీనిని గుర్తించి ముందుగానే విత్తనాలు అమ్మే షాపులపై నిఘా ఏర్పాటు చేసి నకిలీ విత్తనాలు, అమ్మకాలను అరికట్టాలని కోరారు. గతంలో పర్వతగిరి మండలంలో కొన్ని గ్రామాలలో నకిలీ విత్తనాలతో కొంతమంది రైతులు నష్టపోయారు, కావున ముందస్తుగా విత్తనాల తయారీలో బడా కార్పోరేట్ సంస్థలు ప్రజాస్వామ్యంగా సంస్థలు అధిపత్యం చెలాయిస్తున్నాయని రైతులకు విత్తనాలు వాతావరణ అనుకూలంగా లేనటువంటి విత్తనాలు అంటగట్టి లాభాలు పొందుతున్నాయని ప్రభుత్వం ఇటువంటి సంస్థలపై నిఘపెట్టి రైతులకు నష్టం జరగకుండా చూడాలని కోరారు పెరుగుతున్న ఎరువులు డి ఏ పి రకరకాల క్రిమిసంహారక మందులు ధరలు ఇప్పటికే 50% దాకా పెరిగాయని వెంటనే అరికట్టాలని వారు డిమాండ్ చేశారు. యూరియా, సకాలంలో అందాలని కేసీఆర్ ప్రభుత్వంలో యూరియా అందుబాటులో ఉండేది ఇప్పుడు ఉన్న ప్రభుత్వం వచ్చాక యూరియా కొరత ఏర్పడడంతో రైతుల తీవ్రత ఆందోళన చెందారు గతంలో దృష్టిలో పెట్టుకొని ముందస్తు యూరియా కొరత లేకుండా అధికారులు ప్రభుత్వం చర్యలు తీసుకోగలరు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం

# ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పిస్తాం



**తాండూర్, జూన్ 07( జనం సాక్షి)**మంచిర్యాల జిల్లా :తాండూరు మండలంలో తెలంగాణ ఉద్యమకారుల వేదిక అత్యవసర సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో తాండూరు మండల అధ్యక్షుడు నిరంజన్ రావు . మద్దిబోయిన అర్జున్ . మాసాడి శ్రీరాములు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా తోడేటి శంకర్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టివ్వాలని. 250 గజాల స్థలం ఇవ్వాలని. ఉద్యమకారులకు 10 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని. ఉద్యమకారులకు ఉదయకుమార్ గుర్తించి 25వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని. పదివేల కోట్లతో ఉద్యమకారుల బోర్డు ఏర్పాటు చేయాలని. బస్సు పాసు రైల్వే పాసు ఉచిత సౌకర్యం . కల్పించాలని. తెలంగాణ ఉద్యమకారుల ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నాం అని తోడేడ్ శంకర్ గౌడ్ గారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా. తోడేటి శంకర్ గౌడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ తెలంగాణ ఉద్యమకారుల వేదిక. గోగర్ల రాజేశం జిల్లా అధ్యక్షులు తెలంగాణ ఉద్యమకారుల వేదిక. రాష్ట్ర కార్యదర్శి వెల్తురు శంకర్ . తెలంగాణ ఉద్యమకారుల వేదిక. రాష్ట్ర మహిళా విభాగం కన్వీనర్ అనుముల కళావతి . జిల్లా మహిళా అధ్యక్షురాలు. అచ్చ భాగ్యలక్ష్మి .. రాష్ట్ర నాయకులు. చిలక శంకర్ నాయకులు తదితరులు పాల్గొనడం జరిగింది

# బాధిత కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత



**కడెం: జూన్ 7(జనం సాక్షి)** కడెం మండలంలోని నచ్చన్ ఎల్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని పెత్తర్పు గ్రామానికి చెందిన రత్నాల శ్రీనివాస్ అనే వ్యక్తి అనారోగ్యంతో చికిత్స పొందుతూ గత కొన్ని రోజుల క్రితం మృతి చెందారు. ఈ విషయాన్ని గ్రామస్తులు పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూతగా సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ.32 వేల ఆర్థిక సహాయం మంజూరైంది. నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు

కడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొడ్డు గంగన్న ఆదివారం రోజున బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా బొడ్డు గంగన్న మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని, ప్రజలు ఆపదలో ఉన్నప్పుడు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ వెంటనే స్పందిస్తూ అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నచ్చన్ ఎల్లాపూర్ ఉప సర్పంచ్ లక్ష్మి ఆనంద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కిషన్, వెంకటేష్, రాజన్న, భూమన్న, నారాయణ, భూచ్చన్న, పోషలింగు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# భీరన్న ఆలయ నిర్మాణానికి విరాళం



**తాండూర్, జూన్ 07( జనం సాక్షి)**మంచిర్యాల జిల్లా :తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామ శివారులో నూత నంగా నిర్మిస్తున్న భీరన్న దేవాలయ నిర్మాణానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ డిసిసి ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి రూ.5వేల విరాళాన్ని ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామ ఆలయాల నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. భక్తుల మనోభావాల మేరకు ఆలయ నిర్మాణం త్వరగా పూర్తి కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు

# పేసా చట్టంపై అవగాహన సదస్సుకు ఈక సురేందర్‌కు ఆహ్వానం



**జూన్ 07( జనం సాక్షి) గంగారం మండలం** బావురుగొండ గ్రామానికి చెందిన ఈక సురేందర్ గారికి హైదరాబాద్‌లోని తెలంగాణ ఇనిస్ట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (రాజేంద్రనగర్) ఆధ్వర్యంలో నిర్వహించే 'పేసా చట్టం 2026' వర్క్‌షాప్‌కు ఆహ్వానం అందింది. ఈ నెల 10, 11 తేదీల్లో రెండు రోజుల పాటు ఈ సదస్సు జరగనుంది. ఈ అవగాహన సదస్సులో ఆదివాసీల సంక్షేమం మరియు పాలనా పరమైన అంశాలపై విస్తృత చర్చ జరగనుంది. ప్రధానంగా:?ఆదివాసి సాంప్రదాయ చట్టాలు మరియు సామర్థ్య అభివృద్ధి.ఐదవ షెడ్యూల్ ప్రాంతాల పరిరక్షణ.గ్రామసభల బలోపేతం. ఆదివాసులకు రక్షణ మరియు స్థానిక స్వయంపాలన బలోపేతం ఈక సురేందర్ ఈ వర్క్‌షాప్‌కు ఆహ్వానం అందడంపై ఈక సురేందర్ గారు సంతోషం వ్యక్తం చేశారు. ఇలాంటి సదస్సుల్లో పాల్గొనడం వల్ల పాలనాపరంగా మరియు ఆదివాసీ హక్కుల గురించి మరిన్ని కీలక విషయాలు తెలుసుకునే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. హాజరుకానున్న ప్రముఖులుఈ కార్యక్రమానికి పంచాయతీరాజ్ శాఖ మరియు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) గారితో పాటు పలువురు ఐఏఎస్ అధికారులు, కమిషనర్లు మరియు ప్రొఫెసర్లు హాజరుకానున్నట్లు తెలిపారు.